

# కీ. శే. కావ్యశ్రీ

చేస్తున్న మేష్టరీ ఆయనేం చేసైనా మానెయ్యలేదు. ఇతర మేష్టర్లకీ ఆయనకీ గొడవలొచ్చాయి. ఆయనమీద లేనిపోనివన్నీ సృష్టించారు. కుర్రాళ్ళ చేత, ఆయనపేరూ మరో ఆడపిల్లపేరూ కలిపి గోశలెక్కించారు. తెల్లారిలేస్తే వూరువూరంతా అట్టుడికి పోయింది. ఆయనమీద కక్షసాధించడానికి-పాపం-ఏ పాపమూ ఎరగని ఆ అమ్మాయిని రచ్చకీడ్చారు! 'పెళ్ళికాని పిల్ల! ఆపిల్ల బతుకేం కావాలి' అనుకున్నారాయన.

స్వామి చిత్రానంద

ఇక ఆ వూళ్లో తలెత్తుకు తిరగలేక, రాత్రికిరాత్రే హెడ్మాస్టారికి రాజీనామా యిచ్చారు. మేష్టారికి నమ్మిన బంటు ల్లాంటి కొందరు కుర్రాళ్ళు మాత్రం కంట తడితో ఆయన పాదాలు కడిగి సాగనంపారు, ఆ కన్నీటితో ఆ అపవాదు పోదు. అందుకే ఆరాత్రికి రాత్రే భార్యనీ, కూతుర్నీ తీసుకుని వూరు విడిచి పెట్టారు.

ఊరుతోపాటు పేరుకూడా మార్చుకున్నారు. 'కావ్యశ్రీ' అని. ఏ ముహూర్తాన ఈ మార్పు జరిగిందోగాని, ఈ దశాబ్దంలో ఆయన జీవితమే మారిపోయింది. ఇప్పుడు ఆయన ప్రఖ్యాత కథకుడు, ప్రసిద్ధ నవలా రచయిత.

ఆయన రచనల్ని అడగని పత్రిక లేదు. ఇప్పుడు ఆయనకు పేరు వచ్చింది. సంసారం హెచ్చింది. మరో ముగ్గురు వచ్చిచేరారు. కానీ, ఆదాయం అంతంత మాత్రమే. పత్రికల పారితోషికాలు, ఆయన చెప్పే ట్యూషన్లు కలిసి, సంసారాన్ని గుట్టుగా నెట్టుకు వస్తున్నాయి.

ఈ సంవత్సరంలో ఆయన జీవితంలో చిన్న మలుపు వచ్చింది. మూడేళ్ళ క్రితం ప్రచురింపబడిన ఆయన కథకూ, గత సంవత్సరమే విడుదలైన ఒక బెంగాలీ చిత్రానికీ అన్నీ పోలికలేనట! ఆ చిత్రాన్ని అన్ని దక్షిణాది భాషల్లోనూ నిర్మించుకునే అన్ని హక్కుల్నీ కొనడానికి కలకత్తావెళ్ళి, ఆ వంగ నిర్మాతతో బేరం కుదరక, తిరిగి వచ్చిన ఒక తెలుగు నిర్మాతతో, శ్రీ 'కావ్యశ్రీ' గారివద్ద సరిగ్గాఅదేకథ వుందనీ, ఈకథ ఆ సినిమాకన్నా చాలా పాతదనినీ, అంచేత ఆ బెంగాలీ నిర్మాత తన కథను కాపీచేశారనే హక్కు వుండదనినీ బోధించాడు— ఆ నిర్మాతకు ఆప్తుడైన ఒక మిత్రుడు. తెలుగు కథ అయినా, బెంగాలీ సినిమా పోలికలు వున్నాయికదా అవి, నిర్మాత ఆకథను కొన్నాడు. డబ్బు ఎంత యిస్తేనేం? ఒక తెలుగువాడు, ఒక తెలుగు కథను ఒక ఒక తెలుగు నిర్మాతచేత, తెలుగు సినిమాకోసం, తెలుగుదేశంలో కొనిపించాడు. అంతకన్న తెలుగువాడు తెలుగువాడి కేం చెయ్యాలి? తెలుగువాడికేం కావాలి?

చిత్రనిర్మాణం పూర్తయింది.

నేడే మ్యాటినీతో విడుదల!

జంట నగరాల్లోనూ, విజయవాడ-గుంటూరు పట్టణాల్లో ఉదయం ఆటతో....!

బెంగాలీ సినిమా కథే కదా అని తెలుగు కథని, తెలుగు సినిమాగా తీస్తే, తెలుగు జనంకూడా బెంగాలీ కథే అనుకున్నారేమో, విరగబడి చూస్తున్నారు, తెలిసో, తెలియకో "బాగుంది" అని అంటున్నారు, చాలా పత్రికలు చిత్రాన్ని మెచ్చుకున్నాయి. ఓ పత్రిక చిత్రాన్ని పొగుడుతూ, "బెంగాలీ కథ పోలికలు అక్కడక్కడచిత్రంలోకనుపించకుండా వుండకపోవు" అని రాసింది. దాంతో ఆపత్రికమీద నిర్మాతకు కోపంవచ్చింది, కాని, ఏంచేస్తాడు? ఆ మాటలూ నాలుగూ అచ్చై, నలుగురి కంటా పడిపోయాయి. మరో నలుగురి చెవుల్లోకి పాకిపోయాయికూడా. అంచేత "ఆ పత్రిక్కి ఎడ్వర్ టైజ్ మెంట్ ఆపేసెయ్" అని శాసించాడు.

నిర్మాత అదృష్టమో, తెలుగు జాతి అదృష్టమో - లేక 'కావ్యశ్రీ' అదృష్టమో ఆ చిత్రం వందరోజులు ఆడింది! అడ్డం ఏంగొప్ప! ఆడిన అన్ని రోజుల్లోనూ, నిజంగా టిక్కట్లు కొన్న వాళ్ళు, హాలునిండా నిజంగావుండేవారు.

నేడే శత దినోత్సవం!

తెలుగు కవికి తెలుగుదేశంలో అఖండ గౌరవం!!

తెలుగు కవికి తెలుగుదేశంలో తెలుగువారి అసమాన సన్మానం!!!

శతదినోత్సవంలో జిల్లా కలక్టర్లు

తెలుగు చిత్రాన్ని ఇంగ్లీషులో పొగిడారు. మరికొందరు హిందీలోనూ మెచ్చుకున్నారు. మరికొన్ని చోట్ల మంత్రులుకూడా. వుపన్యసించారు. ఒకరు వుపన్యసిస్తూ, తాము చిత్రాన్ని అసలు చూడనే లేదనీ,తాము తప్పక చూస్తామనీ, తాము చూసే వరకూ చిత్రం తప్పక ఆడుతుందనీ, (సభలో కరతాళ ధ్వనులు!) ఇట్టి తెలుగు సినిమాలు, రచయితలూ తెలుగు దేశానికి కావాలనీ, రావాలనీ, వారంతా తెలుగుదేశం తరలివచ్చే శుభసమయం కోసం తెలుగుతల్లి ఎదురు చూస్తోందనీ అలాంటివారికి తమ ప్రభుత్వం సర్వ విధాలా సహకరిస్తుందనీ, అనీ ఇంకా ఏమో వుపన్యసించబోతుండగా, ఎవరో ఓ చీటీ ఆయనకి అందచేశారు. అది చూసిన మంత్రిగారు—

"క్షమించాలె, వేరే కార్యాభారం వుంటంచేత. నేను నిష్క్రమిస్తున్నాను. ఇంతటి మంచి తెలుగు ఫిలిం సినిమాని చిత్రంగా తెలుగులోతీసి, తెలుగువాండ్లకు అర్పణచేసిన ఈ నిర్మాతగార్లకీ, అందున నటింపించి మన అందరికీ- క్షమించాలె - నాగ్గాదు - ఎందుగనంటే, నే నా సినీమా చిత్రాన్ని చూడలేదు. (సభలో చప్పట్లు) మీ అందరికీ ఎంతో ఆనందాన్నీ, ఎంతోవినోదాన్నీ, ఎంతో వికాసాన్నీ, మరి ఎంతో ఎంటర్ టేన్ మెంట్ నీ అందజేసిన, ఈ ఫిలిం సినిమా నిర్మాతగార్లకీ నేను వందనాలు చెప్పుకుంటూ, నే వస్తాను."అని వెళ్ళిపోయారు. ఆయనతో పాటు ఆ టేబిల్ మీద వున్న పూలదండల రాసి కూడా వెళ్ళిపోయింది. అప్పుడే ఆవెనకవున్న 'కావ్యశ్రీ' జనానికి కనుపించారు.

'కావ్యశ్రీ మాట్లాడాలి.'

'వారిని ముందుకు రమ్మనండి!'

'వారు కావ్యపఠనం చెయ్యాలి!'

'కనీసం ఒక్కగేయమైనా పాడాలి!'

అంటూ జనంలో కేకలు.

ఓ పెద్దమనిషి వేదిక మీదకు వచ్చి, మైకులో మూతి పెట్టి, గొంతు సవరించుకున్నాడు. రెండుసార్లు మైకు ముందు చిటికెలు వేశాడు. ఎడమచేత్తో మైకు స్టాండు పట్టుకుని, కుడిచెయ్యి పైకి ఎత్తి—

"అధ్యక్షా! సోదర సోదరీమణులారా! ఈ కార్యక్రమం, ఈ వంద రోజుల యిది, అదేయిది, ఈ శత దినోత్సవం - అంతా ఒక నిర్ణయ కార్యక్రమం - దానిప్రకారమే అంతా జరుగుతుంది. ఇప్పుడే మన మంత్రిగారు వెళ్ళిపోయారు. ఆ తర్వాత, నటీనటుల ఉపన్యాసం వుంటుంది. ఆతర్వాత సాంకేతిక బృంద సమాధానం వుంది. అంచేత మీరంతా, సమాధానంగా - కాదు,కాదు - సావధానంగా వుండి, ఈ సభను దిగ్విజయం చెయ్యాలి." అంటూ వుపన్యసించబోతూంటే—

"నువ్వెనక్కెళ్లు-ఆయన్ని మాట్లాడమను," అని అరిచారు,



గత్యంతరంలేక 'కావ్యశ్రీ' మైకు ముందుకు వచ్చారు.

"మహాశయులారా! నాపైన మీరు చూపుతున్న అభిమానానికి నా కృతజ్ఞత. నేను మాట్లాడవలసిందీ. మాట్లాడిందీ అంతా ఈ చిత్రంలోనే చూచారు. అంతకన్న నేనేమీ మాట్లాడలేను. మీ ఆదరాభిమానాలతో. ఈ విజయంతో నేను మీకు సేవచెయ్యగలనని నమ్ముతున్నాను. సెలవ్."

సభలో కరతాళధ్వనులు.

సభ దిగ్విజయంగానే ముగిసింది. పోలీసులు లాఠీ చార్జీలు చెయ్యలేదు. ఎందుకంటే మంత్రిగారితోనే వెళ్ళిపోయారు పోలీసులు!

ఆరాత్రే అంతా బయల్దేరారు. బృందం అంతా కలిసి 28. అందరికీ రిజర్వేషన్స్ దొరికాయి. అందర్నీ తలో పెట్టెలోనూ సర్దారు. ఆడుకున్నంతసేపూ 'రమ్మీ' ఆడుకుని లైట్స్ ఆఫ్‌చేసి నిద్రలు పోయారు. మెయిల్ పోతూనేవుంది.

ఉన్నట్టుండి పెద్ద చప్పుడు. అప్పర్ బెర్ మీద పడుకున్న స్టంట్ మేస్టారు లోయర్ బెర్త్‌మీద నిద్రపోతున్న డ్యాన్స్ మేస్టారిమీద పడ్డారు.

"అయ్యో! చచ్చాన్!" అన్నారు డ్యాన్స్ మేస్టారు. పైనుంచి తనమీద పడ్డ శరీరం స్టంటు మేస్టారిదని గ్రహించి "ఏమిటండి? ఇక్కడకూడా

మీస్టంట్సు?" అని కోపముద్ర పట్టబోతుంటే, కిటికీలోంచి నీళ్ళు లోపలకు వస్తున్నాయ్.

"అయ్యబాబోయ్! నీళ్ళే! ఏమండీ! ఇదంతా వర్షమే!" అని డ్యాన్స్ మేస్టారు ఆశ్చర్యపోతుంటే, స్టంట్ మేస్టారు—

"కాదండి - రైలు ఏట్లో పడింది!"

"ఏమిటయ్యా! ఆ మాటలు? తథాస్తు దేవతలు 'తథాస్తు' అంటారు."

"మీకేం పర్వాలేదు. నా లంగోటీ పట్టుకోండి. ఒడ్డుకు లాక్కుపోతాను."

"ఏదో నాయనా! నన్ను రక్షించు. రేపు నాకు రోజారాణీ షూటింగుంది కూడాను. ఇన్నేళ్ళకి ఆవిడ కనికరించింది. నా జన్మ తరించింది."

★ ★ ★

"తెలుగు చిత్రపరిశ్రమ పునర్జన్మ!"

"ఏటిలోపడ్డ మెయిల్ నుంచి బతికి బయటపడిన అగ్రశ్రేణి తారలు, సాంకేతికవర్గం"

"చిత్ర రచయిత 'కావ్యశ్రీ' అదృశ్యం, మరణించి వుంటారని అపోహ! మృతదేహం కోసం ఎనమండుగురు జాలర్ల పయనం"

"ప్రయాణీకులకు స్థానిక ఆస్పత్రిలో వైద్య సౌకర్యాలు"

అంటూ ఆవార్త మర్నాడు ఉదయం పత్రికల్లో వచ్చేసింది.

ఇతర ప్రయాణీకులతోపాటు, నిర్మాతలు, సాంకేతిక వర్గమూ, తారాగణమూ అంతా కోలుకుంటున్నారు. స్థానిక సినీమా అభిమానుల సంఘం అధ్యక్ష కార్యదర్శులూ, మాజీ ఎం. ఎల్. ఏ. మ్యునిసిపల్ చెయిర్మన్ వగైరా లంతావచ్చి అందర్నీ పరామర్శిస్తున్నారు.

"అంతా చరణదాసి సినీమాలోలాగ జరిగిపోయింది" అని అంతా ఆశ్చర్యపోయారు. ఒక్క 'కావ్యశ్రీ' గారు మాత్రం కనబడ్డం లేదంటే మరీ ఆశ్చర్యపోయారు. "ఆయనెవరో - తెలుగు మేస్టారో ఏమో_"రవి గాంచనిచో కవిగాంచును" అని చెప్పేసేసి చీకటైనా కవిగారు తోవ తెల్సుకుని ఒడ్డుకు చేరుకునే వుంటారు. ఆ వెధవ ఏరు ఎప్పుడూ యింతేనండీ—నిన్న రాత్రి అంత పొంగిపోయిందా ఇప్పుడు వెధవది ఒక్కచుక్కలేదు. కవిగారికేం భయం లేదు. నేను చెప్తున్నాను చూడండి."

"ఇదేమన్నా సినీమా కథటయ్యా. ఆయనమాత్రం బతకడానికి?" అని హేళనగా చూశాడు మాజీ ఎం.ఎల్.ఏ.

"సినీమాకథ కాకపోయినా, సినీమా కథకుని కథ - ఏమంటారు?" అని అందరివైపు నవ్వరేం! అన్నట్టు చూశాడాయన.

కాని ఎవ్వరూ నవ్వలేదు.

★ ★ ★

"కీ. శే. కావ్యశ్రీ గారి కుటుంబ సహాయనిధి. లక్షరూపాయలు వసూలు కాగల అవకాశం. ఏభై వేల వరకూ వాగ్దానాలు. పదవరోజున సంతాపసభ"

అన్నవార పత్రికలో చూచి గబగబా ఆ పత్రికతో లోపలకు పరుగెత్తి—

"బావా! ఈ పేపరు చూశావా!" అని ఆనాటి దినపత్రికను కావ్యశ్రీకి చూపించారు తల్లావఝుల సుబ్రహ్మణ్యం గారు.

"బావా! పేరు మార్చుకుని మమ్మల్ని దబాయించా లనుకున్నావు. కాని, అదేం కుదరదు. మొన్న ఈ ప్రమాదం గురించి విన్నపుడే నువ్వు అనుకున్నాను. కాని, నువ్వు కాదంటే కాబోలని వూరుకున్నాను. ఏమైనా నువ్వు అదృష్టవంతుడివి.- నువ్వుకాదు- మా చెల్లెలూ దాని పిల్లలూను. ఇండియాలో ఒక్క పిక్చర్‌తో ఇంత మొత్తంగడించిన రచయిత లేదేమో!... తాటాకు మంటలాగ ఈ పేరు పొంగుతుందేగాని, ప్రాణాలు తియ్యదు. ఎన్నిసార్లు చూడలేదూ? ఆ రైలు పడిం తర్వాత, ఆ వరద వుధృతం తగ్గడం, నువ్వు మెల్లిగా ఒడ్డు చేరడం, మాఇంటికి రావడం ఇదంతా ఆ భగవత్కృప! బావా! రేపే నేను మదరాస్ వెళ్తాను. చెల్లెమ్మనీ పిల్లల్నీ తీసుకు వచ్చేస్తాను. ఆ డబ్బుతో యిక్కడ పొలం కొనుక్కుని, బమ్మెరపోతనలా వ్యవసాయం చేసుకుంటూ, కవిత్వం రాసుకుందువుగాని—"

"బావా! నువ్వుపేపర్లో చదివినంతా జరుగుతుందను కుంటున్నావు. అదంత సులువుగాదు. ఇదంతా శ్మశాన వైరాగ్యం లాంటిది. నాకో పాతిక చేబదులియ్. మదరాస్ వెళ్ళగానే, మని ఆర్డరు చేస్తాను."

"ఏమిటోనయ్యా, మొదట్నుంచీ నీదంతా అదో తరహా - ఆమేష్టరీకూడా ఇలాగే వదులుకున్నావ్ - ఇప్పుడూ యింతే — పాతిక రూపాయలకేం? ఎంత కావల్సినా యిస్తాను. నీకిస్తే ఎక్కడికి పోతుంది? నువ్వు కాబోయే లక్షాధికారివి."

"సర్లే ఇయ్యి-"

* * *

"అమ్మా! ప్రొడ్యూసర్ గారు వచ్చారే!" అని కావ్యశ్రీ గారి పెద్దమ్మాయి తల్లితో చెప్పింది. ఆమె ఒక్కసారి కెవ్వుమని ఏడ్చింది.

నిర్మాత వీధి గదిలోనే వుండిపోయి "ఆ ఫొటోవు ఏది?— ఆ మేకు తగిలించు. దండ పట్టుకు రమ్మన్నాను, ఆ మేనేజరేడి?.. మర్చిపోయాడా!.. పోన్లే... ఆరే తగిలించుకుంటారు... అమ్మా! పెద్దమ్మాయీ! ఇయిగోనమ్మ! మొన్న నేపట్టుకెళ్ళిన పుస్తకాలు - అయన్నీ ఏదో చూశాం అంతే! ఆ కదలేం తీసుకోలేదు" అని పుస్తకాల కట్ట తిరిగి యిచ్చేశాడు.

"ఈవేళ డబ్బు యిస్తానన్నారు కదండీ!"

"అదే బ్యాంకికి ఎల్లలేదు, రేపు పంపుతా-ఆ మేనేజరేడీ! నే వస్తాను" అని వెళ్ళిపోయాడు,

"మేనేజరేడి! మేనేజరేడి అంటా వేంటయ్యా. ఆణ్ని వుద్యోగంలోంచి తీసేశాంగా!" అని నిర్మాత బావమరది జ్ఞాపకం చేసి "పోనీ, డబ్బుకావాలంటే నాదగ్గరుంది. ఆరికియ్యి." అన్నాడు.

"ఆ మాత్రం డబ్బు నా దగ్గరా వుంది. నాకు తెలవకనా, నే నివ్వంది. అదంతా త్రేడు సీక్రెటు_ రా నా ఎన కాల."

ఆరాత్రి 'కా వ్య శ్రీ' ఇల్లు చేరు కున్నారు. హాల్లో ఆయన ఫొ టో కి పూలమాల! కింద రెండు దీపాలు!! ఆయనకే కళ్ళనీళ్ళు తిరిగాయి. తండ్రిని చూసిన పెద్దమ్మాయి, 'నాన్నా!' అని కౌగలించుకుంది. గబగబ లోపలకు వెళ్ళింది. 'అమ్మా! నాన్న వచ్చారు' అని తల్లితో చెప్పింది. ఆ నం దం, ఆశ్చర్యం ఒకదాన్ని మించి ఒ క టి ముంచెత్తాయి తల్లిని. అడుగు కదలడం లేదు. ఏమీ తోచడం లేదు. 'కావ్యశ్రీ' ఆమె దగ్గరకు వచ్చారు. ఆమె ఒక్క_ సారిగా ఆయన పాదాలమీద పడింది. 'ఏమండీ!' అని కెవ్వుమంది. పాదాలను కళ్ళకద్దుకుంది. ఆమె కన్నీటితో అవి తడిసిపోయినై. ఆమెను ఓదారుస్తూ ఆమెను పైకి లేవనెత్తారు 'కావ్యశ్రీ.'

★ ★ ★

"ఏమండీ! ఏమండీ!" అని లోపలకు పరుగున వెళ్ళింది. కుంకుమ భరిణె, పసుపుతాడు తెచ్చి, అతని చేతిలో పెట్టింది.

ఆమె నుదుట కుంకుమ పెట్టారు. తాళి గట్టారు. విధివైపరీత్యం! తన భార్యను తానే పునర్వివాహం చేసుకున్నారు! ధనుర్మాసం_దేవుడిగుళ్ళో సన్నాయి వినబడుతోంది. వారి పెళ్ళికి అవే మంగళ ధ్వనులేమో! మొదటి రాత్రికన్న ఆమె ఎక్కు_వ ఆనందాన్ని పొందింది.

మర్నాడు పొద్దున్నే—

"ఎవరే రాత్రి మీ యింటికి చుట్టా




# ఐటెక్స్

సౌందర్యానికి సహాయకారులు

★ ఐటెక్స్ కాటుక

పసిపిల్లలకు కూడా చాలా మంచిది

★ ఐటెక్స్ బిందీ

కంటికింపైన

రంగులలో

లభించును.

★ ఐటెక్స్

కుంకుం పేస్టు




అరవింద్ లేబొరేటరీస్,

పి. బి. 1415 _ మద్రాసు_17.

లొచ్చారు?" అని కావ్యశ్రీగారి పెద్ద అమ్మాయిని అడిగింది పక్కవాటాలో పెధవాడ బడుచు.

"మా నాన్న" అంది కిరికి ఆడు కుంటూ తలైనా ఎత్తకుండా.

"మీ నాన్న! ఏమిటే నువ్వనేది?" మళ్ళీ రెట్టించి అడిగింది.

"ఏం మా నాన్న రాకూడదా?"

"రాకూడదని ఎవరన్నారే తల్లీ - ఘోరకలి అలా మండి పోతూంది - మానా డెరగమమ్మా -" అంటూ కిటికీ లోంచి లోపలకు తొంగి చూసింది.

లోపల ఏదో పని చేసుకుంటున్న కావ్యశ్రీగారి శ్రీమతి నుదుటనున్న బొట్టు కనిపించింది. ఆ బొట్టు పెద్దదై, పెద్దదై తన నుదుటమీదకు వస్తున్నట్టు అనిపించింది. ఆమె భయపడిందో ఏమో, 'హా! శ్రీహరీ!' అని నీళ్ళ బిందెతో సహా కింద పడిపోయింది.

* * *

నేడే సంతాప సభ.

వేదికకు వెనకాల తెల్లటి తెర వేలాడుతోంది. దానిపైన కావ్యశ్రీగారి ఫోటో తగిలించబడివుంది. సంతాప సూచకంగా నల్లటి గుడ్డ ఆ ఫొటోకు చుట్టూరా వుంది. ఆ ఫొటోకు పూల మాల వేయబడి వుంది. ఫొటోకు దిగువన రెండు దీపాలు వెలుగుతున్నాయి. దిగువన ఒక బెంచీ వుంది. దానిమీద కొన్ని పుష్ప గుచ్ఛాలున్నాయి. ఒక వాలంటీరు నిలబడి వున్నాడు. అతని పక్కన ఒక గంపలో పుష్పగుచ్ఛా లున్నాయి.

ఆహూతులందరూ వరుసగా వచ్చి ఫొటోకు నమస్కరించి వెళ్తున్నారు. కొందరు వాలంటీరు యిస్తున్న పుష్ప గుచ్ఛాలు ఆబెంచీమీద వుంచుతున్నారు. కొందరు కన్నీరు కారుస్తున్నారు. వారిని చూసిన కొందరు కళ్ళు తుడుచు కుంటున్నారు. మరి కొందరు తమలో 'పాపం!' అనుకుంటున్నారు.

ఇంతలో ఓ పెద్ద మనిషి వేదిక మీదవున్న మైకులో— "అయ్యా సభ ప్రారంభించడానికి, ఇంకా వ్యవధి వుంది. అంచేత ఆహూతులందరూ, ఉపాహార విందు సేవించమని మనవి" అని చెప్పాడు.

"హమ్మయ్య! బతికించాడు. ఆ మంత్రిగారు వచ్చేవరకూ, ఊరికే కూచోమనకుండా, టిఫిన్లు తినమంటు న్నాడు!" అన్నాడు సభలో పెద్దమనిషి.

"అసలు మంత్రిగారు వస్తున్నారా?" అని సందేహించింది ఓ లావు దేహం.

"అదేం అలా అంటున్నారు?"

"అబ్బే! ఏం లేదు. కవిగారి మీటింగు— అందులోనూ చచ్చిం తర్వాత—"

"వస్తారెండి. ఆయనకు తిరపతి ప్రోగ్రాం కూడా వుందిట!"

"అయితే, తప్పకుండా వస్తారు."

మరో మూల మరో గుంపు—

"బాదం హల్వా బాగుంది గాని - జీడిపప్పు పకోడీయేనండి. మరీ మెత్త పడి పోయింది."

"పకోడీకేం లెండి! ఫ్రూట్ శాలడ్ బావుంది కదండీ?"

అని యెవరి యిష్టం వచ్చిన విష యం మీద వారు యిష్టంవచ్చినట్టు మాట్లాడుకుంటున్నారు.

ఇంతలో ఒక ప్రకటన వినబడింది.

"మహాశయులారా! ఈనాటి ఈ సంతాపసభకి విచ్చేసిన మీరందరూ ఉపాహారవిందు ముగించి వుంటారని మా నమ్మకం. దయచేసి మీమీస్థానాల్లో కూర్చో ప్రార్థన. త్వరలోనే సంతాప సభ ప్రారంభం కానున్నదని తెలియ చేయడానికి సంతోషిస్తున్నాం."

వెనువెంటనే, "తెలియని ఆనందం కలిగెను నాలో ఈ వుదయం" అని పాట మొదలైంది.

★ ★ ★

సభ అంతా కిటకిట లాడుతోంది. అందరికన్నా వెనకాల వచ్చిన అతి ముఖ్యులకు అందరికన్న ముందుగా కుర్చీలు వేస్తున్నారు. దుస్తులు నలగ కుండా ఒయ్యారంగా కూచుని, తమ పక్కనున్న వారిని చిరునవ్వుతో పలక రిస్తున్నారు.

చిత్రనిర్మాత కార్యదర్శి వేదిక మీదకు వచ్చి మైకు ముందు నిలబడి,

"మహాశయులారా! మా ఆహ్వా నాన్ని మన్నించి, ఈ సంతాప సభకు విచ్చేసిన మీ అందరికీ మా స్వాగతం. ఇంతమంది ఈ సభకు రావడం మాకు చాలా ఆనందంగా వుంది. సభను ప్రారంభించ వలసిందిగా మంత్రిగారిని కోరుతున్నాను."

మంత్రిగారు లేచారు. వరసగా దండలు పడ్డాయి. గొంతుక సవరించు కుని, వేదికమీద, వేదిక కింద అంద రినీ పరికించి వుపక్రమించారు. "ఇప్ప టికే చాలా ఆలెస్యమై పోయింది. దండలుతీసి. ఖండువాతీసి మీ కాలాన్ని వృథాపుచ్చను. అసలు సభల్లోపాల్గొనే వాలామంది - చాలా మందేమిటి? — నేనుకూడా - సభలో పాల్గొనడానికి గర్వపడుతున్నాను, ఆనందపడు తున్నాను అని అంటారు. కాని, నేను మాత్రం చాలా విచారపడుతున్నాను. సరిగా నేటికి పదిరోజులక్రితం శత దినోత్సవంలో పాల్గొన్న నేను అదే సమస్త జరుపుతూండిన ఈ సంతాప సభలో పాల్గొనడం కాకతాళీయంకాదు. నేను తిరపతి వెళ్తున్నమాట నిజమే. కాని, ఈమీటింగులో పాల్గొనాలని నేను వూహించలేదు. ఆ శతదినోత్సవంలో వారిని నేను స్వయంగా చూశాను. హాస్యంగా మాట్లాడాను. వారింకా పది కాలాలపాటు వుంటారనీ, పది పది హేను కథలు రాస్తారనీ అనుకున్నాను. కాని సరిగా, పది రోజులైనా కాక ముందే ఈ సంతాపసభ జరపాలనీ ఏ ఒక్కరూ వూహించలేదు. అదే విధి! అదే ఫేట్! నేను అంత్యోపన్యాసం కూడా యిప్పుడే చేసివెళ్ళి పోతాను. ఎందుకంటే లోగడ నుడివినట్లు నాకు తిరుపతి వెళ్ళవలసిన కార్యాభారం వుంది. 'కావ్యశ్రీ'గారు కథ రాసి మరణించారు. వారి కథ ఫిలిం సినిమా గా తీసిన చిత్ర నిర్మాతలు వారి కుటుం బానికి సహాయనిధి ఏర్పాటు చేయడం

ఎంతైనా ముదావహం. అంతటి విశాల హృదయం గలవారు విశాలాంధ్రలో చాలా అరుదు. అందుచేత నేను వారిని మనస్ఫూర్తిగాను, హార్దికంగాను అభి వాదిస్తున్నాను. వారియొక్క ఈ మహత్తర ప్రయత్నాన్ని, ఈ ఎగ్నాన్ని దిగ్విజయంచేసి, తెలుగువారి పేరు ప్రతిష్ఠల్ని నిలపవలసిందిగా తెలుగు వారిని కోరుతున్నాను."

ఇంతలో కార్యదర్శి ఒక జాబితాను తీసుకొచ్చి, మంత్రిగారికి అందించాడు. మంత్రిగారు ఆ జాబితాను తీసుకుని తన పక్కనున్న నిర్మాతకు యిస్తూ, "నేను కార్యాభారంచేత వెళ్ళిపోతున్నాను. నేను అంత్యోపన్యాసం కూడా యిచ్చేశాను. మిగతా కార్యక్రమాన్ని నిర్వహించ మని నిర్మాతగారిని కోరుతూ నేవెళ్ళి పోతాను"అని వేదికదిగి వెళ్ళిపోయారు.

ఆ జాబితాను తీసుకుని నిర్మాత చదువుతూ "మహాశయులారా! తారీఖు వారీగా అందిన మొత్తాలలో ఈ జాబితా తయారైంది. తక్కువ మొత్తం యిచ్చిన వారి పేర్లు ముందు, ఎక్కువ మొత్తం యిచ్చినవారి పేర్లు వెనకా వుండవచ్చు. అంచేత ఎక్కువ మొత్తం యిచ్చినవారు తమ పేర్లు ఆఖరున చదువుతున్నామని ఆగ్రహించ వద్దని ప్రార్థన."

ఇంతలో అధ్యక్షులు అడ్డుతగిలి. "పేర్లన్నీ చదవాలంటే, చాలా కాల హరణం. అంచేత —"

"కాదు, పేర్లు చదవాలి, చదవాలి." అని కేకలు.

అధ్యక్షులు లేచి, "మహాశయులారా! ఈ సభలో హాజరైన వారిలో కొందరు మాత్రమే విరాళాలు యిచ్చారు. కార్యకర్తలు ఆ జాబితాను మీ వద్దకు తీసుకు వస్తారు. మీకు తోచిన విరాళాలు మీరు రాసియివ్వండి. సభ చివరిలో పేర్లు చదువుదాం. ఈ లోగా నిర్మాతగారు తమ కార్యక్రమం గురించి మాట్లాడతారు"

నిర్మాతగారు లేచి, "సభకు నమస్కారం. తెలుగు కథని, తెలుగువాని వద్ద కొన్న గనత మాకు దక్కడం, మేము తెలుగు వారమై వుండడం, మాకు చాలా గర్వ కారణంగా వుంది. తొలి చిత్రంతోనే 'సెంచరీ' కొట్టిన గనత కావ్యశ్రీగారికి దక్కింది.... ఆరి కథ యింత ఇజయమై, మా కిన్ని లాబాలు పంచి పెట్టినందుకు ఆరికేమబీ అలాగ అనాదాల్లాగా వుంటం మేం చూల్లేం - అంచేత ఈ పిచ్చుర్ మీద 'సెకండ్ రన్ను' మీద ఒచ్చే దబ్బంతా ఆరికే- అదే ఆరి కుటుంబానికి ఇస్తాం"

నిర్మాత తాలూకు జనం చప్పట్లు ప్రారంభించారు. వారివెనకాల మిగతా జనంకూడా కొట్టారు.

ఓమూల గుసగుసలు. "డిస్ట్రిబ్యూటర్స్ యింకేం ఆడతారండీ-వాళ్ళడబ్బు కాస్తా వచ్చేసిం తర్వాత?"

"నూర్రోజుల్లోనూ పీల్చి పిప్పిచేసి వసూలుచేస్తే, ఇంకేం వస్తుంది డబ్బు?"

"అందని పువ్వులు దేవుడికి అర్పించాట్ట!"

వేదికమీద వున్న నిర్మాత.... "నా తరువాత కావ్యశ్రీ గారికి బాగా తెలిసిన స్నేహితులున్నారు. ఆరుమాట్టాడతారు"



ఒత్తుగా మెత్తగా నిగనిగలాడే
సుదీర్ఘ కేశసంపదకు

## కేశవర్ధిని

పెట్టింది పేరు
కొబ్బరినూనెతో తిరిగి కలప
నవసరంలేకుండా వాడడానికి

## కేశవర్ధిని

## రెడీమిక్స్డ్ హేరాయిల్

మీ శిరోజాలను పరిమళ
భరితంగా శుభ్రంగా ఉంచడానికి

## కేశవర్ధిని షాంపూ



# కేశవర్ధిని ప్రాడక్ట్సు

27 మాసిలామణి
మొదలియార్ రోడ్,
మద్రాసు_14.



"నేను, కావ్యశ్రీగారు ఇరుగుపొరుగు గ్రామస్తులం. వారి వూరికీ మా వూరికీ ఓ పడవల కాలవమాత్రమే అడ్డు. మా చిన్నతనమంతా కల్సి గడిపాం. వారు మాయింటికి రావడం, నేను వారింటికి పోవడం జరుగుతూ వుండేది. మా మార్గాలు వేరైనాయి. నేను ప్రొడక్షన్‌లో పడి దర్శకుడ నయ్యాను. ఆ తర్వాత వారూ ప్రొడక్షన్‌లోకి వచ్చారు. చిన్నప్పుడు మే మిద్దరం వియ్యమందాలని అనుకునేవారం. ఆ వాగ్దానాన్ని నేను నెరవేరుస్తాను. మా అమ్మాయిని వారి అబ్బాయికి యిస్తాను."

సభలో చప్పట్లు.

"నాపేరు పూరిశెట్టి పెదవీరవెంకట సత్యనారాయణ బాలాజీ వరప్రసాదరావు. మా తొలి చిత్రానికి కథను రాసివ్వమని "కావ్యశ్రీ" గారికి అడ్వాన్సు యిచ్చాను. ఆ అడ్వాన్సును వారి కుటుంబానికి సహాయనిధిగా జమకట్టమని కమిటీవారిని కోరుతున్నాను. వారు మాకు కథ యివ్వకుండానే కాలంచేశారు. అయినా, వారి కుటుంబం కష్టపడడానికి వీల్లేదు. అందుకే మా అడ్వాన్సును వారికే యిచ్చేస్తున్నాము."

సభలో చప్పట్లు.

"నేను మా నిస్వార్థ ప్రచురణల తరఫున వారి అముద్రిత గ్రంథాలన్నింటినీ. ప్రచురించ దలిచాను. ఆ విషయమై వారితో మాట్లాడానుకూడా. వారు అంగీకరించారు. అడ్వాన్సుగా వారికి నూటొక్క-రూపాయి యిచ్చాను. 'అడ్వాన్సు అన్నతర్వాత ఎంతయినా అడ్వాన్సే' అని నూర్రూపాయలూ



తిరిగి యిచ్చారు. అలాంటి నిస్వార్థజీవి గ్రంథాలు ప్రచురించి మా నిస్వార్థ ప్రచురణలు సార్థకం కావాలి. అందుకు మే మెంతో గర్వపడుతున్నాం".

సభలో చప్పట్లు -

"నేను 'కావ్యశ్రీ' గారిని చాలా కాలంగా ఎరుగుదును. మా పరిచయం ఈనాటిదికాదు. వారితో నేను స్నేహం ప్రారంభించి అచిరకాలం అయింది. మా స్నేహం అపారమైంది. అసలు వారి అసలుపేరు మీలో చాలామందికి తెలియదు. అసలు 'కావ్యశ్రీ' అని వారికి సూచించింది నేనే. అసలు వారి కథను కొనమని నిర్మాతకు సూచించిందీ నేనే. వారితో,వారికుటుంబంతో, నాకు అవినాభావ సంబంధం వుంది. 'కావ్యశ్రీ'గారు లేని నా బతుకు...." అని భోరున ఏడ్వడం మొదలెట్టి, మాట్లాడ్డం మానేశాడు.

"మీరింకా మాట్లాడతారా ?" అని అధ్యక్షులు అడిగారు.

మాట్లాడాలని వున్నా, నోట మాట రావడం లేదని సైగచేశాడు.

ఇంతలో ఎవరో యిద్దరు వచ్చి, ఆయన్ను బయటకు తీసుకెళ్ళి, ఫేన్ దగ్గర కూచో బెట్టి సోడా యిచ్చారు.

ఒట్టి సోడాయేనా? అన్నట్టు మొహం అదోలాపెట్టి తాగుతున్నాకు.

అధ్యక్షులు లేచి, "వీరు మాట్లాడుతూంటే, మన హృదయం కరిగిపోయింది. "కావ్యశ్రీ" గారి జీవితం అంతటి మహత్తరమైనది. వారితో పరిచయంవున్న ప్రతి ఒక్కరూ వారిని మరువలేరు" అని చేతిరుమాలుతో కళ్ళ తుడుచుకుంటున్నాడు.

"అధ్యక్షా! ఏమిటీ ఏడుపులు! ఏమిటీ వుపన్యాసాలు! అని సభలో ఓమూల

నించి కేక వినబడింది. అంతా అటు తిరిగారు. ఓ పెద్దమనిషి వేదిక మీదకు నడిచి వస్తున్నాడు. అంతా ఆయన్ని తేరి పార చూశారు. వేదిక ఎక్కాడు.

"అధ్యక్షా! నాకు మాట్లాడేందుకు అనుమతి కావాలి."

"మాట్లాడండి, మీరు ?"

"కావ్యశ్రీ"

"కావ్యశ్రీ జూనియరా ?"

"కాదు. కావ్యశ్రీయే-"

"హా!"

"హా!"

"హె....హె........హేమిటీ!"

"ఏం కంగారు పడకండి. మీరంతా చచ్చిపోయాడనుకున్న 'కావ్యశ్రీ'ని నేనే. కాని చావలేదు.

"అయితే, మనం చచ్చాం." అనుకున్నారు సభలో కొందరు.

"అసంభవం!" అని ఎవరో అరిచారు.

"ఏది అసంభవం? నేను బతకడమా? దయచేసి సావధానంగా వినండి. ఆరోజు నేను ఏట్లోపడి, కొట్టుకు పోయాను. కొంత దూరం పోయేసరికి వరద తగ్గిపోయింది. కాలికి నేల తగిలింది. అప్పుడు నడిచివెళ్ళి అగ్రహారం చేరాను. మా బావమరిది గారి యింట్లో వున్నాను."

"ఉండి యిప్పుడు డబ్బు పట్టుకెళ్ళడానికి వచ్చావా ?" అని ఎవరో అరిచారు.

"అధ్యక్షా! ఇతనెవరో మన మీద కక్షసాధించడానికి పంపబడిన శత్రు పక్షపు మనిషి. ఇతన్ని విడవకూడదు."

"నన్ను విడవవద్దు. అధ్యక్షా! కాని, నేను చెప్పేది దయచేసి వినండి."

"ఏం వినక్కర్లేదు. మేం ఒక బృహత్కార్యం ప్రారంభిస్తే, మధ్య నీ అడ్డేమిటి ?" అంటూ మీదకు రాబోయాడు కార్యదర్శి.

"ఈ బృహత్కార్యానికి ఎవరి అనుమతి తీసుకున్నారు ?" అని రెట్టించారు 'కావ్యశ్రీ'

"మంచి కార్యానికి ఒకరి అనుమతి ఏమిటి ?"

"ఏమిటండీ! మంచికార్యం ? బతికుండగా, చచ్చిపోతున్నామన్నా, పచ్చి మంచినీళ్ళు పొయ్యని మీరు, చచ్చిన తర్వాత పంచభక్ష్య పరమాన్నాలూ పెడతామంటారు అంతేనా ?"

"అసలు ఎవరివోయ్ నువ్వు ?"

"'కావ్యశ్రీ' అని ముందే చెప్పానుగా!"

"చెప్పావుసరే-అసలు నువ్వెవరవు? నిన్నెవరు పంపారు ?"

"అదేమిటండీ! మీరంతా నన్ను బాగా ఎరుగుదుమని వుపన్యాసాలు దంచారుకదా యిప్పటివరకూ-! ఇప్పుడిలా నిర్ఘాంత పోతారేం ?" అని ఒక వుపన్యాసకుడి దగ్గరకు వెళ్ళి, "మహాశయా! మనిద్దరం బాల్యస్నేహితులం అన్నారు కదండీ! అయితే, మా స్వగ్రామం ఏవూరో చెప్పండి చూదాం-"

"అవన్నీ యిప్పుడేం జ్ఞాపకం?" అని మొహం అటు తిప్పేశాడు.

"ఏమండీ! పబ్లిషర్ గారూ! వెనకటి పుస్తకాల తాలూకు డబ్బు ఎన్నిసార్లడిగినా యివ్వరేం? మీకు నా అముద్రిత గ్రంథాల ప్రచురణ హక్కు యిచ్చానా? మీకు ఒక్కసారి పుస్తకం యిస్తే, మళ్ళీ మీ ముఖం చూడగలరా ఎవరైనా?"

"మాది నిస్వార్థ ప్రచురణలు. అది మర్చిపోతున్నారు."

"అవును. స్వార్థంలేని వారి పుస్తకాలే ప్రచురిస్తారు" అని, ఏడ్పిసోడా తాగిన పెద్దమనిషి దగ్గరకు వచ్చారు 'కావ్యశ్రీ'. ఆయన్ని ఎగాదిగా బాగా చూశారు.

"వీరెవ్వరో మహా నటులుగా రాణి రాణిస్తారు. ఏడుపు పాత్రలు బాగా పోషిస్తారు. ఏమండీ! నన్ను గుర్తుపట్టారా?....మాట్లాడరేం?"

"ఏమిటోయ్! మాట్లాడేది. మేం యింతటి ఘనకార్యం చేస్తుంటే, ఓర్వలేక, మా వ్యతిరేకులు దుష్ప్రచారం చేయడానికి, "కావ్యశ్రీ" గారి పోలిక లున్న నిన్ను పంపారు. అయినా, ప్రయత్నం ఆగదు. అది జగన్నాధ రథం! సాగిపోతుంది. అడ్డువచ్చిన వాళ్ళు నలిగి...."

"ఆపండి. మీ జగన్నాధ రథాన్ని. నన్నూ నా కుటుంబాన్నీ రచ్చకీడ్చే, ఈసభ జరపడానికి మీకు అనుమతి ఎవరిచ్చారు?"

"అనుమతేమిటోయ్? ఇది మా ధర్మం. సంఘంలో ఓ మహత్తర వ్యక్తి, అకాల మరణం పొందితే వారి కుటుంబం అతి నిరాధారమైపోయి, రోడ్డుపాలు అవుతూంటే, చూస్తూ వూరుకుంటామా?"

"ఇదంతా మీకు నామీద వున్న జాలా? లేక మీ కీర్తి కాంక్ష? చెప్పండి."

సభ అంతా నిశ్శబ్దం.

"మాట్లాడరేం? ఏమండీ! నిర్మాత గారూ! మీరు మా యింటికొచ్చి, డబ్బు యిస్తానని ఎందుకివ్వలేదు?"

"ఎలాగూ యిక్కడ యిస్తున్నాం గదా అని_"

"ఇంట్లో యిస్తే అది ఎవ్వరికీ తెలియదు. మీ ధర్మానికి పబ్లిసిటీ వుండదు. అంతేనా?"

"అయితే, ఇదంతా మేం పబ్లిసిటీ కోసం చేస్తున్నామా? ఇందులో పరమార్థం లేదంటారా?"

"లేదు. ఈషన్మాత్రంకూడా లేదు."

"ఎందుకు లేదూ? అధ్యక్షా! అతని బయటికి లాగించి, సభను సాగనివ్వండి. ఈ ఒక్కమనిషి అడ్డువచ్చి

---

★ ఒకడు : "నా జన్మలో నేనింతవరకు ఎవడి దగ్గిరా తలవంచలేదు."
మరొకడు : "మంగలి దగ్గిర కూడా?"

నంతమాత్రాన ఇందరం తలపెట్టిన ఈ మహాయజ్ఞం ఆగరాదు."

"లాగండి, ఆయన్ని బయటకు లాగండి" అని సభలో కేకలు.

స్టంటు మేస్టారూ ఆయన అను చరులూ వేదిక మీదకు దూకారు. కావ్యశ్రీగారి రెక్కపుచ్చుకు బయటకు లాగారు. ఆయన రానంటే, ఆయన డొక్కలో పొడిచారు. ఆ దెబ్బకి కావ్యశ్రీ పడిపోయారు. అప్పుడు ఆయన్ని అంతా తలో పోటూ పొడిచారు.

"ఆయనకి మొహం మీద నీళ్ళు చల్లండి" అన్నా రెవరో ఓ మహాత్ముడు.

"ఏమీ అక్కర్లేదు.సభకానివ్వండి"

అధ్యక్షులు లేచి, జాబితాను పుచ్చుకుని, "మంచి పనులకీ, మంచి మనుషులకీ యిలాంటి అడ్డు తగులుతూనే వుంటుంది. అలాగని మంచి వారు, మంచి పని చేయకుండా వూరుకోరు. ఇంతవరకూ రు 98,723-00 తో జాబితా తయారైంది. నేను మాత్రం 1,277-00 నా విరాళంగావేసి లక్ష పూర్తిచేస్తున్నాను."

"ఆపండి - మీలక్షమీరూను - బతికున్నవారిని చంపి, ధర్మాలు చేసి గొప్పవారమవుదా మనుకున్నారా మీ లక్ష - మీభిక్ష - ఎవరికీ అక్కర్లేదు."

అంటూ ఒక స్త్రీ కంఠం ఏడుస్తూ వినబడింది.

"అమ్మా! ఎవరమ్మా మీరు! ఆయనకూ మీకూ ఏమిటి సంబంధం ?"

"వారు....మా వారే!"

"నిజమా ?"

ఆమె నోట మాట రాక, అవునన్నట్టు తలవూపి కింద పడిపోయింది.

"హా! "

"నిజమే ! ఎంత పొరబాటై పోయింది ?"

"అనవసరంగా, తొందరపడి చెయ్యి చేసుకున్నారు."

"నిష్కారణంగా లక్ష వృథా చేశారు."

"లక్ష పోవడం ఏమిటండీ ! కీ.శే. 'కావ్యశ్రీ'గారి కుటుంబానికి సహాయం చేయాలను కున్నాం. చేశాం. మన కోరిక నెరవేరింది. భగవంతుడు మనయందే వున్నాడు !"

కార్యదర్శి వేదిక మీదకు వచ్చి—

"మహాశయులారా ! కీ.శే.కావ్యశ్రీ గారి కుటుంబ సహాయనిధికి వాగ్దానాలు చేసిన, పెద్దలు త్వరలోనే విరాళాలు యిచ్చి, మా మహాయజ్ఞాన్ని, విజయవంతం చేయ వలసిందని ప్రార్థన."

వెనువెంటనే 'జనగణమన' ప్రారంభమైంది.

***